ఆంధ్రప్రదేశ్‌లో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని (ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ) ప్రధాన 'అభివృద్ధి ఇంజను' (Growth Engine)గా గుర్తించింది. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, జీవన ప్రమాణాల (Quality of life) వృద్ధికి, పౌరులకు సుపరిపాలన (Good governance) అందించేందుకు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ దోహదం చేస్తుంది. రాష్ట్రాన్ని నాలెడ్జి సొసైటీగా తీర్చిదిద్ది సమాచార విజ్ఞానాన్ని ప్రజలకు, ముఖ్యంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గ్రామీణ ప్రజానీకానికి అందించడం ప్రధాన లక్ష్యాలు. సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ విషయాలలో ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా ఉండాలనేది ప్రభుత్వ ఆకాంక్ష. ప్రభుత్వం ఇప్పటికే అనేక ఇ-గవర్నెన్స్(E-governance) ప్రారంభ చర్యల ద్వారా సమర్థవంతమైన, పారదర్శకతతో కూడిన జవాబుదారీ సేవలను, సమాచారాన్ని ఒకే కౌంటరు ద్వారా పొందే విధానాన్ని అమలు చేస్తోంది. ఐ.టి./ఐ.టి. ఆధారిత ఎడ్యుకేషనల్ సేవల ద్వారా ప్రభుత్వం సహాయం చేస్తోంది. ఇన్‌ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (2005-2010 ఐ.సి.టి-3) విధానం ప్రకారం 2009 నాటికి జాతీయ ఐ.టి. మార్కెట్‌లో 30 శాతం రాష్ట్ర వాటా సాధించాలనేది లక్ష్యం.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఘనత వహించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ వంటి సంస్థల్లో 16,000కు పైగా ఐ.టి. నిపుణులు శిక్షణ పొంది సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగాలు పొందారు. ఫ్యాబ్ డిజైనింగ్, టెలికం, రీసెర్చి, డెవలప్‌మెంట్, యానిమేషన్, కంప్యూటర్ గేమ్స్, మొదలైన అంశాలలో సాఫ్ట్‌వేర్ రంగం సేవలం దిస్తోంది. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలు నోకియా, డిలోయిట్టి (Deloitte), గూగుల్, మైక్రోసాఫ్ట్, విప్రో, సత్యం మొదలైన కంప్యూటర్ సంస్థలు తమ శాఖలను హైదరాబాద్‌లో విస్తరిస్తున్నాయి. 1992లో కేవలం 15 యూనిట్లతో మొదలైన ఐ.టి. పరిశ్రమ 2007-08 నాటికి 1584 యూనిట్లకు చేరుకుంది. 2007-08లో 176 కొత్త యూనిట్లు. 40 విదేశీ కంపెనీలు మన రాష్ట్రంలో సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా (STPI)లో రిజిస్టర్ చేసుకున్నాయి.

పట్టిక

ఆంధ్రప్రదేశ్‌లో ఐ.టి. పరిశ్రమ ప్రగతి

సంవత్సరం	కంపెనీల సంఖ్య	ఎగుమతులు (కోట్లలో)	ఉపాధి (సంఖ్య)	పెట్టుబడులు (కోట్లలో)
1992-93	15	4.2	–	–
1996-97	88	134	4,500	–
1999-00	977	1059	25,500	1423
2003-04	1055	5025	85,945	3533
2005-06	1234	12,521	1,51,789	6101
2006-07	1408	18,582	1,87,450	8,001
2007-08	1584	26,122	2,39,000	NA

మూలం : ఎ.పి. టెక్నాలజీ సర్వీసెస్ రికార్డులు

ఎగుమతుల్లో ఐ.టి. రంగం రారాజు

పై పట్టికను పరిశీలిస్తే సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో గత 11 ఏళ్లలో (1996-97 - 2007-08) గణనీయమైన అభివృద్ధిని మన రాష్ట్రం సాధించింది. 1996-97లో కేవలం రూ. 134 కోట్లుగా ఉన్న ఐ.టి. ఎగుమతులు ప్రస్తుతం వేల కోట్ల రూపాయలకు చేరాయి. జాతీయ స్థాయిలో 2004-05లో వీటి ఎగుమతుల వృద్ధిరేటు 34 శాతం, 2005-06లో 36 శాతం, 2006-07లో 32 శాతం ఉంటే అదే సమయంలో ఏపీలో ఎగుమతుల వృద్ధిరేటు 64.5, 51, 48.4 శాతాలుగా ఉంది. 2006-07లో దేశంలో ఐ.టి. ఎగుమతుల్లో మన రాష్ట్రం 4వ స్థానంలో ఉంది. మొత్తం (1997-2007) ఐ.టి. రంగంలో లభించిన ఉద్యోగాల్లో 1,53,055 ఉద్యోగాలు గత నాలుగేళ్లలో లభించినవే. 2007-07 వరకు ఐ.టి. రంగంలో వినియోగించిన రూ. 8001 కోట్ల పెట్టుబడుల్లో, 50 శాతానికి పైగా అంటే రూ. 4468 కోట్లు 2004-2006ల మధ్య జరిగినవే. 2010 నాటికి ఐ.టి. రంగం ద్వారా మరో 2 లక్షల మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. జవహర్ నాలెడ్జి సెంటర్ల (JKCs) ద్వారా ఏడాదికి 20 వేలమందికి ఉద్యోగాలు కల్పించాలని భావి స్తున్నారు.

2006-07లో రాష్ట్రం నుంచి మొత్తం ఎగుమతులు రూ. 35,672 కోట్లు. వీటిలో 52 శాతానికి పైగా సాఫ్ట్‌వేర్ ఎగుమతులే ఉన్నాయి. జాతీయ ఖజానాకు (National Exchequer) లభించే రెవెన్యూలో 13.9 శాతం 2006-07లో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌వేర్ రంగం అందించింది.

ఐ.టి. మౌలిక సదుపాయాలు

ఆంధ్రప్రదేశ్‌లో ఐ.టి. రంగం అభివృద్ధి కోసం అనేక మౌలిక సదుపాయాలు సమకూరుస్తున్నారు. ఇప్పటికే హైటెక్ సిటి I, II, III దశలు ; విశాఖపట్నం, విజయవాడ, వరంగల్, తిరుపతిలలో మినీ

సాఫ్ట్‌వేర్ పార్కులు, శంషాబాద్‌లో నిర్మాణంలో ఉన్న హార్డ్‌వేర్ పార్కులో పరిశోధన అభివృద్ధి (R & D) కోసం నానో టెక్నాలజీ పార్క్, మెగా ఫాబ్స్ (Mega Fabs) సెమీ కండక్టర్ల తయారీ చేపడుతున్నారు.

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఐదు ఐ.టి. టౌనుషిప్ నిర్మాణాలు పూర్తి కానున్నాయి. మరో 10 జిల్లాల్లో ఐ.టి. హబ్బులు (I.T. Hubs) కడప, అనంతపూర్, హిందూపూర్, నెల్లూరు, మహబూబ్‌నగర్, కరీంనగర్‌లలో ఐ.టి. టెక్నాలజీని అభివృద్ధిపరచి రాష్ట్రంలో నలుమూలలకు ఐ.టి. నాలెడ్జి అందించేందుకు కృషి చేస్తున్నారు.

మానవ వనరుల అభివృద్ధి

ఈ కార్యక్రమం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ గవర్నెన్స్ (IEG) ఆధ్వర్యంలో మన రాష్ట్రంలో నిర్వహిస్తున్నారు. సరైన నైపుణ్యాలను బోధించి చివరి సంవత్సరం ఇంజినీరింగు చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపర్చడం; ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, వ్యక్తిత్వ, కమ్యూనికేషన్ నైపుణ్యాలను విద్యార్థులకు అందించి పరిశ్రమలకు కావలసిన నిపుణులను జేకేసీ తీర్చిదిద్దుతోంది. జేకేసీల ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులు 70 ప్రభుత్వ శాఖల్లో అనేక ఐ.టి. సేవలు అందిస్తున్నారు. టీంవర్క్, టైం మేనేజ్‌మెంట్, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్ విషయంలో ప్రాక్టికల్ నాలెడ్జిని జేకేసీల ద్వారా విద్యార్థులు పొందుతున్నారు. 2007-08లో 295 ఇంజినీరింగ్ కాలేజీల నుంచి 22,915 మంది విద్యార్థులు జేకేసీలో నమోదు చేసుకుని నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటున్నారు.

ఈ-సేవ

పౌరులు కాలయాపన లేకుండా ఈ-సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లోనే బిల్లులు చెల్లిస్తున్నారు. వివిధ సర్టిఫికెట్ల జారీ, పర్మిట్లు, లైసెన్సులు, ఎ.పి. ట్రాన్స్‌కో, జి.హెచ్.ఎం.సి, రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, కమర్షియల్ టాక్సులు, వాటర్ వర్క్స్, వాల్యూయేషన్ సర్టిఫికెట్లు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్లు, రైల్వే రిజర్వేషన్లు, ట్రాన్స్‌పోర్ట్ ఆథారిటీ సేవలు మొదలైనవాటిని ఈ-సేవ పరిధిలో చేర్చారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లో ఈ-సేవలు అందించడానికి ఐ.టి. శాఖ ఆధ్వర్యంలో 2008లో 2,300 రాజీవ్ సిటిజన్ సెంటర్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అక్టోబరు 2007 నాటికి జిల్లాల్లో 745 లక్షల వ్యవహారాలు (రూ.5539.82 కోట్లు విలువ కలిగినవి), హైదరాబాద్‌లో 738 లక్షల వ్యవహారాలు (రూ. 15156.77 కోట్లు విలువ కలిగినవి) ఈ-సేవల ద్వారా నిర్వహించారు.

'పరిష్కారం' కాల్ సెంటర్: ప్రజలు తమ సమస్యలను ఆయా ప్రభుత్వ శాఖలకు తెలిపి పరిష్కారం పొందేందుకు బి.ఎస్.ఎన్.ఎల్. టోల్‌ఫ్రీ డయల్ నంబరు '1100' ఏర్పాటు చేసింది. ఆన్‌లైన్ ద్వారా నమోదైన మొత్తం ఫిర్యాదుల్లో (2004-2007ల మధ్య) 92.96 శాతం (అంటే 1.04 లక్షలు) పరిష్కారమయ్యాయి.

రాజీవ్ ఇంటర్‌నెట్ విలేజ్

2005 ఆగస్టులో దీనిని ప్రారంభించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత శక్తివంతం చేసే ప్రయత్నంలో భాగంగా ఈ-గవర్నమెంట్ పద్ధతులను గ్రామీణులకు చేరవేసి వారిని చైతన్యవంతం చేయడం, ప్రభుత్వ సేవలను గ్రామీణులకు మరింత దగ్గరకు చేర్చడం ఈ పథకం ముఖ్య లక్ష్యాలు. దీనిలో భాగాలు:

ఎ) **రూరల్ కియాస్క్‌లు:** వీటి ద్వారా సులభంగా గ్రామాలకు సమాచార సర్వీసులను అందిస్తున్నారు.

బి) **రూరల్ నెట్‌వర్క్:** ఎక్కువ శక్తి ఉన్న బ్యాండ్‌విడ్త్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు కనెక్టివిటీ కల్పిస్తున్నారు. బెల్ (BEL), టైమ్స్ (TIMES) సంస్థల ద్వారా 572 కియాస్క్‌లు స్థాపిస్తే ప్రస్తుతం 225 పని చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల 4687 కామన్ సర్వీసు సెంటర్లు స్థాపించి పౌరులకు తమ ఇంటిముంగిటే సేవలు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించినందువల్ల అదనంగా రాజీవ్ కియాస్క్‌లను మన రాష్ట్రంలో చేపట్టలేదు.

ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్

ఒకే గవాక్షి (Single Window) ద్వారా వివిధ పౌరసేవలు (Civic Services) ఆన్‌లైన్ విధానం కింద అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం టాటా కన్సల్టెన్సీ కంపెనీ (TCS) భాగస్వామ్యంతో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోర్టల్‌తో సేవలందిస్తున్నారు.

మరిన్ని ప్రభుత్వ చర్యలు

రాష్ట్ర ఐ.టి. విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎ.పి. ఇన్వెస్ట్ సంస్థ ద్వారా ఐ.టి. రంగంలోకి పెట్టుబడులు ఆహ్వానించడం, ఐ.టి. విధానం ద్వారా అమలవుతున్న ప్రాజెక్టుల పని తీరును అధ్యయనం చేయడం. అలాగే రాష్ట్రంలో అమలవుతున్న ఐటి విధానాల అభివృద్ధి, అధ్యయనం, సమీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ప్రమోషన్ కమిటీ(ITPC)ని నియమించింది. ఐ.టి. పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్న స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(SMES)కు తక్కువ ధరకు విద్యుత్, ఉద్యోగాల సంఖ్యను బట్టి భూమి విలువలో ఉద్యోగానికి రూ. 20,000 సబ్సిడీ కల్పించే జోనింగ్ నిబంధనల నుంచి మినహాయింపు, భూమి కొనుగోళ్లలో 50 శాతం స్టాంపు డ్యూటీ తగ్గింపు, మొదలైన రాయితీలను ప్రభుత్వం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఐ.టి. పరిశ్రమ అభివృద్ధికి విస్తారమైన అవకాశాలున్నాయి. ఈ పరిశ్రమ పట్టణ ప్రాంతాల్లోనే కాక గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించాలి. సామాజిక రంగానికి చెందిన విద్య, వైద్యం, పేదరికం సమస్యలను అధిగమిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఐ.టి. రంగం వేగంగా వృద్ధి చెందుతుంది.